సామెత కథలు

# భరద్వాజ విందు

- ముసునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.

భరద్వాజుడు బృహస్పతి యొక్క పుత్రుడు. సప్తర్షులలో నొక్కడైన యీతడు గంగయొడ్డున గూర్చుండి తపము చేసికొంటూ ఉండేవాడు. వనవాసం చేస్తుండే రాముడీతని యాశ్రమానికి ముందుగా వెళ్ళి తాపసోచితమైన ఆతిథ్యం స్వీకరించాడు.

అరణ్యవాసానికై వెళ్ళిన శ్రీరామ చంద్రమూర్తిని బిలుచుకొనిరాదలచి జాడలు తెలిసికోవడానికై భరతుడు వేలకొలది అనుచరులతో సేనాసమేతంగా బయలుదేరి, దారిలో భరద్వాజుని ఆశ్రమం చేరాడు. అతని పవిత్ర హృదయాన్ని గుర్తించిన భరద్వాజుడు మిక్కిలి అభినందిస్తూ వారి జాడలు తెలిపాడు.

వెంటనే వారి ఆతిధ్య సత్కారాలకోసం (విందు చేయదలచి) సర్వ దేవతలను విశ్వకర్మను మనసారా వేడుకొన్నాడు. విశ్వకర్మ కృపవల్ల రాజునకు, సేనలకు జక్కని వసతులేర్పడ్డాయి. దేవతల యపార కృపవల్ల రకరకాల యుపహారసామాగ్రి పిండివంటలు, పంచభక్ష్యపరమాన్నాలు కుప్పలకొలది పోగుపడ్డాయి. పెక్కు మంది దేవతాస్త్రీలు వచ్చి, స్వయంగా వడ్డించారు. రంభ, ఊర్వసి, మేనక, తిలోత్తమ వగైరా దేవవేశ్యలు ఆటా - పాటా సాగించారు. గంధర్వులు గానంచేసారు. ఎవరికే పదార్థం కావలసివచ్చినా ఆయా పదార్థాలు చిటికెలో తృప్తిగా, అంత సమృద్ధిగా, మఱెచ్చటా ఎప్పుడూ లభించియుండలేదు. కనుక గొప్పవారింటి విందులకు భరద్వాజ విందు అని పిలవడం కద్దు.

గమనిక : పై కథ ముసునూరి లక్ష్మీగణపతిశాస్త్రి గారిచే రచించబడిన 'తెనుగు జాతీయముల కథలు' పుస్తకము నుండి సేకరించబడినది.

పాత సామెత : భరద్వాజ విందు.
కొత్త సామెత : జయలలిత విందు, లల్లూ విందు.
- మాఘుపు వాసంతి.